క్లుప్తంగా

నేడు బాపూజీ నగర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ నగర్‌లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నూతన విద్యుత్ లేన్ల పని నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బాపూజీనగర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులకు సహకరించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఫిరంగిపురం: మండలకేంద్రంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ పుల్లారెడ్డి సోమవారం తెలిపారు. మార్నింగ్ స్టార్ కళాశాల వద్దనున్న స్టేడియం వద్దకు 15న ముఖ్యమంత్రి హెలీకాప్టర్ రానుండటంతో భద్రతాచర్యల్లో భాగంగా విద్యుత్ లైన్లు సరిచేస్తున్నామన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని నిడమర్రు రోడ్ లో ఉన్న అరవింద మోడల్ స్కూల్‌లో సోమవారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృష్ణా జిల్లా ఎమ్మెల్సీ కల్పలత విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్యంగా ఉంటారని, మానసిక ఒత్తిడిని అధిగమించి, శరీర దృఢత్వానికి దోహదపడుతుందన్నారు. అనంతరం క్రీడల్లో రెడ్, ఆరెంజ్, ఎల్లో, గ్రీన్ గూప్రులుగా పోటీపడి గెలుపొందిన వారికి బహుమతులు, మెడల్స్ అందజేశారు. పాఠశాల డైరెక్టర్ బి. ఇంద్రాణి, ప్రిన్సిపల్ చాగంటి అరవింద్, పాఠశాల అకడమిక్ ఇన్‌చార్జి ఎం. వరలక్ష్మి, పీటీలు ఎస్. సురేష్‌కుమార్, సీహెచ్. సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సౌకర్యాలపై అధికారులకు నివేదిస్తాం



తాడేపల్లిరూరల్: ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సోమవారం తాడేపల్లి సీఐ తన సిబ్బందితో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామని, ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, పోలింగ్ జరిగే కేంద్రాల చుట్టూ ప్రహరీలు ఉన్నాయా లేవా అనేది పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎక్కడెక్కడ ఎటువంటి సదుపాయాలు కల్పించాలో సంబంధిత శాఖ అధికారులకు పోలీస్ శాఖ నుంచి రాతపూర్వకంగా అందజేస్తామని, ప్రస్తుతం పరిశీలించిన పోలింగ్ కేంద్రాలు అన్నీ బాగున్నాయని ఆయన అన్నారు.

ఆటోడ్రైవర్‌పై రౌడీషీటర్ దాడి



తాడికొండ: రౌడీషీటర్ షేక్ రియాజ్ హల్‌చల్ చేసి ఆటోడ్రైవర్ పరమేశ్వరరావుపై దాడికి పాల్పడిన ఘటన తాడికొండ చింతచెట్టు సెంటర్‌లో సోమవారం జరిగింది. వివాదాస్పదానికి కేరాఫ్ అయిన షేక్ రియాజ్ అనే రౌడీషీటర్ రాత్రి 10 గంటల సమయంలో ఆటోడ్రైవర్‌పై దాడికి దిగి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దాడితో ఆటోడ్రైవర్ అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గంజాయి మత్తులో ఉన్న రియాజ్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పరమేశ్వరరావును ఆపి అకారణంగా దాడికి పాల్పడ్డాడు. రియాజ్‌పై పలు కేసులు ఉన్నాయి. మద్యం దుకాణం వద్ద, ఆర్టీసీ బస్సుల్లో, కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఘటనలు ఉన్నాయి. పలు కేసుల్లో నిందితుడైన రియాజ్ గంజాయి సేవించిన సమయంలో చిత్ర విచిత్రంగా ప్రవర్తిస్తుంటాడు. దాడికి పాల్పడిన సమయంలో వంద మందికి పైగా ఘటనా స్థలంలో ఉన్నప్పటికీ ఎవరూ అడ్డుపోలేదు. అడ్డుపోయేవారిపై కూడా దాడికి పాల్పడడం రియాజ్ నైజ. అపస్మారక స్థితిలో ఆటోడ్రైవర్ పరమేశ్వరరావు స్థానికులు 108 సహాయంతో గుంటూరు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. నిందితుడిని పట్టుకుని స్థానికులు పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిని కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

గుంటూరు వెస్ట్ డీఎస్పీగా మహేష్

గుంటూరు ఈస్ట్: నగర వెస్ట్ డీఎస్పీగా కె.వి.మహేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2018లో డీఎస్పీగా చేరిన ఆయన కర్నూలు టౌన్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం నరసరావుపేట నుంచి బదిలీపై గుంటూరు వెస్ట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు నియంత్రించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాత్రి గస్తీ విస్తృతం చేస్తామని చెప్పారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

'గుడ్ మార్నింగ్ మంగళగిరి'లో సమన్వకర్త గంజి చిరంజీవి



సమన్వయకర్త గంజి చిరంజీవికి స్థానికుడి ఆత్మీయ ఆలింగనం

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా సుపరిపాలన అందిస్తోందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి అన్నారు. సోమవారం మంగళగిరి 9వ వార్డులో గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా గడప గడపకు తిరిగి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంజి చిరంజీవి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ఏ గడపకు వెళ్లినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు పొందిన వారు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల సంతోషాన్ని చూడలేక ప్రతిపక్షంలో ఉన్నవారు కొంత మంది విష ప్రచారానికి తెరలేపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పేద ప్రజల అభివృద్ధి కోసం, వారు తలెత్తుకుని తిరిగేలా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో ఎంతోమంది ఆర్థిక పరిస్థితి సరిగా లేక కాల్‌మనీ వ్యాపారుల బారిన పడి మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడా కూడా ఆ పరిస్థితి లేదన్నారు. రెండేళ్ల కరోనా మహమ్మారితో పేద ప్రజలు ఎటువంటి పనులు లేక ఇంటి నుంచి బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆర్థిక లోటు ఉన్నప్పటికీ పేద ప్రజల ఆకలి తీర్చేందుకు సంక్షేమ పథకాలు అమలు చేశారని, వాటిని సైతం ప్రజలు బహిరంగంగానే మా దృష్టికి తీసుకు వస్తున్నారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ నిర్మించని రోడ్లను వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించారని, ప్రజలు తెలిపిన సమస్యలను కార్పొరేషన్ అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని అన్నారు. కొంత మంది ప్రతిపక్ష నాయకులు మంగళగిరిపై ఎప్పుడూ చూపించని ప్రేమను ఇప్పుడు చూపిస్తున్నారని, ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరని, అధికారంలో ఉన్నప్పుడు ప్రజల బాగోగులు ఎందుకు పట్టించుకోలేదు అని గంజి చిరంజీవి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తే పేద ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, మాజీ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, స్థానిక నాయకులు సింగిరేసు కృష్ణ, రామనాథం, సుబ్రహ్మణ్యం, ఉద్దంటి కృష్ణ, తోట శ్రీనివాసరావు, మల్లవరపు సుధారాణి, నిర్మల, కుంచాల కిషోర్, బెజ్జం రాజాజీ తదితరులు పాల్గొన్నారు.

• చేనేత వస్త్ర ప్రభవనం





చేనేత వస్త్ర వ్యాపారానికి అనుకూలంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్, ప్రగడ కోటయ్య చేనేత భవన సముదాయం అందుబాటులోకి వచ్చింది. మంగళగిరి పట్టణ పరిధిలోని నిడమర్రు పాత బస్టాండ్‌లో నిర్మించిన ఈ భవనాన్ని ముఖ్య అతిథి ఎంపీ విజయసాయిరెడ్డితో కలిసి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి సోమవారం ప్రారంభించారు. దీంతో చేనేత వస్త్ర వ్యాపార విస్తరణకు, కొనుగోలుదారులకు మరింత సౌలభ్యం కలుగనుంది.

– తాడేపల్లి రూరల్

వైభవంగా పుష్కర బ్రహ్మోత్సవ మహాకుంభాభిషేకం



ఉత్సవాల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలోని దుర్గాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పుష్కర బ్రహ్మోత్సవ మహాకుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గత మూడురోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి చివరి రోజైన సోమవారం పూర్ణాహుతి, అనంతరం మహాకుంభాభిషేకం చేశారు. శతాధిక ప్రతిష్ఠాపనాచార్య దుర్భాకుల సాంబమూర్తి అవధాని, విష్ణుభట్ల ఆంజనేయ చయనులు పర్యవేక్షణలో శ్రీసచ్చిదానంద సరస్వతీ మహాస్వాముల చేతుల మీదుగా మహాకుంభాభిషేకం జరిపించారు. ఈ వేడుకకు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరయ్యారు. సంప్రదాయ బద్ధంగా వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. తదుపరి అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రి ఏడు గంటలకు శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొండా లక్ష్మీనారాయణ-లక్ష్మీదేవి, పుచ్చా గోపాలకృష్ణమూర్తి-శైలజ దంపతులు, వడ్లమూడి రాఘవేంద్ర శివవరప్రసాద్, బ్రహ్మాండం సుబ్రహ్మణ్యశాస్త్రి-రాజ్యలక్ష్మి, కొండా విమలాదిత్య-అనూరధ, పిన్నమరాజు వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమ శర్మ, కఠారి హరీష్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మురుగు కాల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 18వ వార్డులో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండటంతో సిబ్బందిపై కొంత అసహనం వ్యక్తం చేశారు. ప్రతి రోజు వాటిని బాగు చేయించే విధంగా చూడాలని ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. ఆమె వెంట కౌన్సిలర్ తోట రఘురామ్, 18వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ అన్సారీ, కృష్ణబలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, బ్రదర్ ఆనందన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఏఈ చైతన్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

ఎనిమిది మందిని అరెస్ట్ చేసి 3.6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, పక్కన సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ ప్రకాశరావు

తెనాలిరూరల్: చెడు వ్యసనాలకు బానిసలై అక్రమంగా గంజాయి అమ్ముతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గంజాయి నిందితుల వివరాలను డీఎస్పీ బి.జనార్ధనరావు తెలియజేశారు. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు ఎనిమిది మంది సభ్యుల ముఠా గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. పట్టణ ఆర్‌ఆర్‌నగర్‌కు చెందిన షేక్ నాగూరా, ఐతానగర్‌కు చెందిన రాహుత్ సల్మాన్ జ్యోతుల రాజ్‌పాల్, ఉప్పుతోళ్ల స్వామి, సీఎం కాలనీకి చెందిన మండూరి ఏడుకొండలు, సింహాద్రి పూర్ణచంద్, బాలాజీరావుపేట మహేంద్ర కాలనీకి చెందిన బల్లం భీమరాజు, ద్వారకా నగర్‌కు చెందిన మక్కెన చంద్రకిరణ్ పాత నేరస్తులు. జల్సాలు, గంజాయి, మత్తుపదార్థాలకు అలవాటు పడిన వీరు తేలికగా డబ్బు సంపాదించేందుకు కొంత కాలంగా గంజాయి అమ్మకాలు చేస్తున్నారు. నర్సీపట్నంలో నాలుగు కిలోల గంజాయిని రూ.10 వేలకు కొని ఇక్కడ పొట్లాలు కట్టి అమ్ముతున్నారు. వీరి అక్రమ వ్యాపారంపై సమాచారంతో నిఘా ఉంచిన త్రీ టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ షెడ్డు వద్ద తనిఖీలు చేయగా వీరి వద్ద గంజాయి గుర్తించారు. నిందితుల వద్ద నుంచి 3.6 కిలోల గంజాయి రూ.800 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. తెనాలిలో ఇప్పుడిప్పుడే గంజాయి విక్రయాలు తగ్గుముఖం పడుతున్నాయని, పూర్తిగా అరికట్టేందుకు అందరూ సహకరించాలని కోరారు. నిందితులను అదుపులోకి తీసుకున్న త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్ బాబు, ఏఎస్‌ఐ షేక్ హైదర్ అలీ, పీసీలు ఎం.అంకయ్య, పి.మురళి తదితరులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

జెడ్పీ హైస్కూల్‌కు యూపీఎస్ అందజేత

తెనాలిటౌన్: రూరల్ మండలం కొవెవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాష ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కందిమళ్ళ రమేష్‌బాబు పాఠశాల అవసరాల నిమిత్తం యూపీఎస్‌ను బహూకరించారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీధర్‌కు యూపీఎస్‌ను ఆయన అందజేశారు. దీని విలువ సుమారు రూ.5వేలు ఉంటుందని తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.

రైల్లో నుంచి పడి గుర్తు తెలియని వృద్ధుడి మృతి



తెనాలిరూరల్: రైల్లో నుంచి పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన తెనాలి-రేపల్లె రైలు మార్గంలోని పల్లెకోన స్టేషన్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం పడి ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 60 నుంచి 65 ఏళ్ల మధ్య ఉంటుంది. రైల్లో నుండి ప్రమాదవశాత్తు జారిపడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన వేలం

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని కూరగాయాలు, చేపలు, చికెన్, మటన్, జంతు వధ శాల, పండ్ల మార్కెట్‌కు సంబంధించిన వేలం పాటలను సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి సోమశేఖర్ యాదవ్ తెలిపారు. కూరగాయల మార్కెట్‌ను అబ్బవరపు వెంకటేశ్వరరెడ్డి రూ.15 లక్షలకు, జంతు వధ శాల, చేపలు, చికెన్, మటన్ మార్కెట్‌లను షేక్ సైదా రూ.4లక్షల 70వేలు, పండ్ల మార్కెట్‌ను యూజేసీ రూ.1.30 లక్షలకు పాడుకున్నట్లు చెప్పారు. వీరి కాల పరిమితి ఏడాదిపాటు ఉంటుందన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. మండల కేంద్రం కొల్లిపరలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గుర్తించి అతని నుంచి 12 క్వార్టరు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

రూరల్ ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

తెనాలిరూరల్: తెనాలి రూరల్ ఎస్‌ఐగా పి.కోటేశ్వరరావు బాధ్యతలను సోమవారం స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఆయన 2013లో ట్రైనీ ఎస్‌ఐగా తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లోనే శిక్షణ పొందారు. అనంతరం వెల్దుర్తి, యడ్లపాడు, పెదనందిపాడు, చిలకలూరిపేట, పొన్నూరు రూరల్, అమరావతిలో పని చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. నూతన ఎస్‌ఐకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఉన్నతాధికారులను కలిశారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న సీహెచ్.వెంకటేశ్వర్లు ప్రకాశం జిల్లాకు బదిలీ అయిన సంగతి తెలిసిందే.

సోషల్ మీడియా అసత్య కథనాలు నమ్మొద్దు

తాడేపల్లిరూరల్ : కొన్ని సోషల్ మీడియా వేదికల్లో వస్తున్న అసత్య కథనాలను ప్రజలు నమ్మొద్దని తాడేపల్లి సీఐ మధుసూదనరావు అన్నారు. సోమవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడేపల్లిలోని ఓ ప్రైవేటు యూనివర్శిటీలో ఇద్దరు విద్యార్థులు, ఒక విద్యార్థినిని ప్రేమించారని, అందులో విద్యార్థిని చంపివేశారని తప్పుడు కథనాలు తాడేపల్లి పోలీసుల పేరు మీద సోషల్ మీడియాలో వస్తున్నట్లు చెప్పారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇలాంటి ఘటనలు ఎక్కడా చోటు చేసుకోలేదని, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు సోషల్ మీడియాలో వస్తున్న కథనాలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు.ఈ అసత్య కథనాలు ఎవరు పోస్ట్ చేస్తున్నారో పరిశీలిస్తున్నామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో ప్రజలకు అసౌకర్యం కల్పించే విధంగా ఎవరైనా ప్రవర్తించినా, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా వెంటనే తాడేపల్లి పోలీసులకు 86888 31361కు లేదా 86888 31355కు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలియజేశారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ఫిరంగిపురం: మండంలోని 15 సచివాలయాల పరిధిలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్నట్లు మండల అధికారులు సోమవారం తెలిపారు. సచివాలయాల వారీగా వివరాలు తెలియజేసారు. 113తాళ్లూరు 1,055, అమీనాబాద్-1 పరిధిలో 1,260కార్డులు, అమీనాబాద్-2 పరిధిలో 6,09కార్డులు, బేతపూడి 1,170, యర్రగుంట్లపాడు 565, గుండాలపాడు 590, మేరికపూడి 1,331, నుదురుపాడు 954, ఫిరంగిపురం-1పరిధిలో 1,354, సచివాలయం-2 పరిధిలో 1,006, సచివాలయం -3లో 1,634 కార్డులు, పొనుగుపాడు 1,066, రేపూడి 705 కార్డులు, తక్కెళ్లపాడు 1357, వేమవరం 982 కార్డులు మొత్తం 15,668 కార్డులు వచ్చాయని వాటిలో ఇప్పటి వరకు 9225 కార్డులను వలంటీర్లు పంపిణీచేసినట్లు వివరించారు.

సాహితీరత్న పూర్ణ ప్రజ్ఞాచారికి సత్కారం



తెనాలిటౌన్: భారత కోకిల సరోజని నాయుడు జయంతి సందర్భంగా విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయ ఆడిటోరియంలో నవభారత్ నిర్మాణ సంఘం గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. పుణ్యభూమి నా దేశం నమో నమామి అనే అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీరత్న పూర్ణ ప్రజ్ఞాచారి పాల్గొన్నారు. పుణ్యభూమి నా దేశం శీర్షిక పేరిట పద్యపఠనం చేశారు. ప్రజ్ఞాచారి తన పద్యాలలో దేశ ఔన్నత్యం, దేశ భక్తి, పర్యావరణం, ప్రపంచశాంతి, తెలుగు భాష అభిమానం ప్రజల్లో పెంపొందే విధంగా ఆయా అంశాలను పొందుపరచి పద్యరచన చేశారు. న్యాయనిర్ణేతలు అతనిని ఎంపిక చేశారు. సాహితీ సంస్థల వ్యవస్థాపకులు కలిమి శ్రీ, గాంధీ నటరాజన్, తదితరులు ప్రజ్ఞాచారిని అభినందించి జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు.

వైభవంగా భావనారుషి స్వామి రథోత్సవం

తెనాలి: స్థానిక షరాఫ్‌బజారులో వేంచేసియున్న భద్రావతి సహిత భావనారుషి స్వామివార్ల కళ్యాణమహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఏడు గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. రథంపై స్వామి, అమ్మవార్లను నెమలి వాహనంపై ఆసీనులను చేశారు. పట్టణ వీధుల్లో వైభవంగా ఊరేగింపు సాగింది. పద్మశాలీయ కులబంధువులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 11వ తేదీన ఆరంభమైన కళ్యాణ మహోత్సవాలు ఈనెల 29వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బిట్రా రామలింగేశ్వరరావు, పద్మశాలి బహూత్తమ సంఘం అధ్యక్షుడు బట్టు జగత్‌కోటి నరేంద్రబాబు, సంఘ ప్రధాన కార్యదర్శి కొడాలి క్రాంతికుమార్, దేవస్థానం బోర్డు సభ్యులు గుంటి ధనలక్ష్మి, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, తాడిపర్తి చంద్రశేఖర్, కొతరపు వెంకటరమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన షేక్ బాజీ

మేడికొండూరు: విద్యుత్ ఘాతానికి గురైన తాపీ మేస్త్రీ మృతిచెందిన ఘటన మండలంలోని పేరేచర్ల, సత్తెనపల్లి రోడ్డులోని లక్ష్మీనరసింహ కాలనీలో సోమవారం రాత్రి జరిగింది. మండల కేంద్రమైన మేడికొండూరుకు చెందిన షేక్ బాజీ (37) తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా కూలి పనులకు వెళ్లి ఒక ఇంటి వద్ద పనిచేస్తున్నాడు. పైపులైనులో ఉన్న మట్టిని ఇనుప రాడ్‌తో తొలగిస్తున్న సమయంలో రాడ్ పైకి లేపడంతో పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతుడి భార్య ఐదు సంవత్సరాల క్రితమే మృతిచెందింది. కుమారుడు, కుమార్తె ఉన్నారు.

11వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా 'దాట్ల'



తెనాలిరూరల్: 11వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది దాట్ల మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఇటీవలి వరకు ఇదే కోర్టు ఏపీపీగా పని చేసిన ఆయన కాల పరిమితి ముగిసింది. తిరిగి ఆయన్నే ఏపీపీగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జె.సుదర్శనరెడ్డి నుంచి ఉత్తర్వులను ఆదివారం అందుకున్నారు. మూడేళ్ల పాటు మోహన్‌రెడ్డి 11వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా సేవలు అందిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా మోహన్‌రెడ్డి స్వగ్రామం బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధలు తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంకలోని నెహ్రూనగర్ 2వ లైన్‌లో ఉండవల్లి మల్లికార్జునరావు(40) తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య పద్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం తాడేపల్లిలో స్పైస్ ఆరోమా పేరుతో ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించాడు. అతని భార్య పద్మ కూడా రెస్టారెంట్‌కు వెళ్తూ భర్తకు చేదోడువాదోడుగా ఉంటోంది. ఈ క్రమంలో రెస్టారెంట్ సరిగ్గా నడవక అప్పుల పాలై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. అప్పుల బాధల గురించి తరచూ భార్యతో చెబుతూ మథన పడుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 8 గంటలకు అతను ఇంటి నుంచి రెస్టారెంట్‌కు వెళ్లాడు. ఆ తర్వాత భార్య కూడా రెస్టారెంట్‌కు వెళ్లింది. ఇంటికి వెళ్లి వస్తానని తన భార్యకు చెప్పి 9.30 గంటలకు మల్లికార్జునరావు ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. భార్య పద్మ భర్తకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న సుధ అనే మహిళకు ఫోన్ చేసి విషయం చెప్పి ఇంటికి వెళ్లి చూడమని చెప్పింది. వెంటనే ఆమె ఇంటికి వెళ్లి చూడగా తలుపులు వేసి ఉన్నాయి. కిటికీలో నుంచి లోపలకి చూడగా మల్లికార్జునరావు ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సహాయంతో కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీజీహెచ్‌కి సర్జికల్ పరికరాల అందజేత

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌కి ఎస్‌క్యూఎల్ సర్జికల్స్ అధినేత కోటగిరి శోభన్‌బాబు సోమవారం రూ. 1.10 లక్షల విలువ గల బ్లడ్ కలెక్షన్ ట్యూబ్‌లు, సర్జికల్ గ్లౌజ్‌లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు, పలువురు దాతలు ముందుకు వచ్చి సహాయం అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ , డాక్టర్ చంద్రకుమార్, డాక్టర్ అబ్దుల్ సత్తార్, సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని, గంగమ్మ, బయోమెడికల్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.